





శ్రీశైలంలో కళాకారుల ప్రదర్శన

కైలాస వాహనంపై శివ పార్వతులు

- సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు
- నేడు పార్వతీ కళ్యాణం
- స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ



కైలాస వాహనంపై విహరిస్తున్న భ్రమరాంబ, మల్లికార్జున స్వామి



శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగిరి శివ నామస్మరణతో హోరెత్తుతోంది. సంక్రాంతి సందర్భంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు దూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. దీంతో క్షేత్రం రద్దీగా కనిపిస్తోంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వివరాలు 8వ పేజీలో..



పగిడ్యాల మండలం నెహ్రూనగర్ వద్ద కృష్ణానదిలో అలవి వలలతో చేపలు పడుతున్న దృశ్యం



కృష్ణా నదిలో చేపల మాఫియా



కృష్ణానదిలో నిషేధిత అలివి వలలతో చేపల వేట యథేచ్ఛగా సాగుతోంది. కృష్ణానది బ్యాక్ వాటర్ తగ్గే కొద్ది ఫిషింగ్ మాఫియా విజృంభిస్తోంది. నాలుగైదు నెలల్లోనే చేప పిల్లలతో సహా కృష్ణా నదిలో ఉన్న మత్స్య సంపద మొత్తాన్నీ దోచుకుంటూ రూ.కోట్లు గడిస్తున్నారు. దోమ తెర కంటే సన్నటి రంధ్రాలు ఉన్న వలలు వాడటం వల్ల కృష్ణమ్మ ఒడిలోని చిన్న చేప పిల్లలు సైతం అందులో పడిపోతున్నాయి. గుడ్లను కూడా ఈ వలలతో లాగేస్తుండడంతో మత్స్య సంపద తగ్గిపోతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు చేపల మాఫియాపై కన్నెత్తి చూడటం లేదు.

నందికొట్కూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీరంలో నిషేధిత అలివి వలలతో పలువురు చేపల వేట సాగిస్తున్నారు. ఇక్కడ నిత్యం రూ.లక్షల్లో మత్స్య వ్యాపారం సాగుతోంది. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లోని శాతనకోట, మల్యాల, నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పోతులపాడు, సంగమేశ్వరం, జానాల గూడెం, బలపాల తిప్ప, ఇలా పాతాళగంగ వరకు 100 కి.మీటర్లకు పైగా కృష్ణా నదిలో చేపల వేట కొనసాగుతోంది. నవంబరు నుంచి కృష్ణానదిలోని క్రమంగా నీరు తగ్గుతుంది. ఈ సమయంలో చేపలు పట్టేందుకు కొందరు అక్రమంగా అలివి వలలతో నదిలోనే మకాం వేస్తారు. శాతనకోట వద్ద, మూర్వకొండ, వీరాపురం, అర్లపాడు, సంగమేశ్వరం తదితర ప్రాంతాల్లో ఉన్న తిప్పలపై గుడారాలు వేసుకుని మరీ అలివితో చేపలవేట కొనసాగిస్తున్నారు.



కృష్ణానదీ తీర ప్రాంతంలో ఎండబెట్టిన చేపలు

వలవేసి పట్టేస్తారు

మత్స్యకారుల జీవనోపాధి కోసం మత్స్యశాఖ లక్షల్లో చేపపిల్లలను సంవత్సరంలో రెండు సార్లు నెహ్రూనగర్ వద్ద కృష్ణానదిలో వదులుతారు. అధికారులు చేపపిల్లలను వదిలాక ఫిషింగ్ మాఫియా అలివి వలలతో నదిలో నుంచి తోడేస్తున్నారని, తమకు ఎలాంటి ఉపయోగం ఉండదని స్థానిక మత్స్యకారులు వాపోతున్నారు.

చిన్న పిల్లలకే డిమాండ్

సాధారణంగా కృష్ణానదిలో వదిలే చేప పిల్లల్లో బేర్షలు, బట్టగెండె, పొట్టు, మోసు రకాలు ఉంటాయి. వీటిలో ఔషధాలు, కాస్మొటిక్స్‌లో ఉపయోగిస్తారు. ఒక్కసారి అలవి వల నదిలో వేస్తే సుమారు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు చేపలు, చేపపిల్లలు చిక్కుతాయి. ఇందులో సగం వరకు చిన్న పిల్లలే ఉంటాయి. వాటిని నది ఒడ్డున అరబెట్టి విజయవాడకు రవాణా చేశారు. ఇటు ఏపీ అటు తెలంగాణ రాష్ట్రాల అధికారులు దాడులు చేస్తేనే మత్స్యసంపద పెరిగే అవకాశం ఉంటుంది.

- యథేచ్ఛగా మత్స్య దోపిడీ..
- తిష్టవేసిన ఇతర రాష్ట్రాల కార్మికులు
- నదీ తీరాన, ఎత్తయిన తిప్పలపై స్థావరాలు
- రూ.కోట్లలో అక్రమ వ్యాపారం
- పట్టించుకునే నాథుడే కరువు
- నిద్రావస్థలో మత్స్యశాఖ అధికారులు.



తెలంగాణ నుంచి కూడా..

తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా పెంట్లవెల్లి మండలంలో జటప్రోలు, మంచాలకట్ట, మల్లేశ్వరం, కొల్లాపూర్ మండలంలోని అమరగిరి, సోమశిల తదితర శివార్లలోని నదీ తీరంలో అలివి వలలతో వేట సాగిస్తారు. అక్కడ ఎండ బెట్టిన చిన్న చేపలను సంచుల్లో నింపి పడవల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని నదీ తీర పల్లెలకు తరలిస్తారు. ఇక్కడి నుంచి విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాలకు మాఫియా ఎండు చేపలను తరలిస్తారు.

మిగతా 8వ పేజీలో

సంక్రాంతి శుభాకాంక్షలు : కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా కలెక్టర్ పి.రంజిత్ బాషా శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలు, భోగభాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగుతూ ఉండాలని, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సొంత గ్రామాల మీద మమకారానికి మనమంతా ఇచ్చే గౌరవానికి సంక్రాంతి పండుగ ఒక ప్రతీక అని ఆయన అన్నారు.

సంక్రాంతి సందడి

- ఘనంగా భోగి వేడుక
- నేడు మకర సంక్రాంతి, రేపు కనుమ



కర్నూలులో జరిగిన భోగి వేడుకల్లో పాల్గొన్న టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి

కర్నూలు (కల్చరల్), జనవరి 13: మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి వేడుకలు జిల్లాలో ఘనంగా ఆరంభమయ్యాయి. సోమవారం జిల్లా ప్రజలు 'భోగి' వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. వాడవాడలా వేకువ జామునే భోగి మంటలు వేశారు. పాతసామగ్రిని, పాత వస్తువులతో భోగిమంటల్లో వేసి కాల్చి, పాతకు స్వస్తి చెప్పి, కొత్త క్రాంతిని స్వాగతించారు. భోగి వేడుకల్లో భాగంగా కొందరు తమ పిల్లలకు భోగిపళ్ల పోసి, వారికి దిష్టితీశారు. కాగా మంగళవారం సంక్రాంతిని, బుధవారం కనుమ వేడుకలకు ప్రజలు సిద్ధమయ్యారు. రైతులు తమ ఇంట కొత్త ధాన్యంతో చేసిన పిండివంటలతో వేడుకలను ఉత్సాహ వాతావరణంలో నిర్వహించుకోనున్నారు.



సంక్రాంతి వేడుకల్లో గంగిరెద్దు విన్యాసాలు

కైలాస వాహనంపై శివ పార్వతులు





శ్రీశైల క్షేత్రంలో కైలాస వాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవారుల

- సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు
- నేడు పార్వతీ కళ్యాణం
- స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ

శ్రీశైలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాసవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. లోకకల్యాణార్థం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్ర పారాయణాలు, చతుర్వేద పారాయణాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కైలాసవాహనంపై ఆశీనులను చేసి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, డమరుక నాదాలు, చెంచుల నృత్యాల సందడి భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు

భోగి పండుగను సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణలో భాగంగా సోమవారం భోగి వేడుకలను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. వేకువజామున స్వామి, అమ్మవార్లకు ప్రాతఃకాల పూజలయ్యాక ప్రధాన ఆలయం మహాద్వారం ఎదుట గంగాధర మండపం వద్ద భోగి మంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. పిడకలు, ఎండుగడ్డి, వంట చెరుకుని వేసి భోగి మంటలను రాజేశారు.

సామూహిక భోగి పండ్ల కార్యక్రమం

భోగి పండుగను పురస్కరించుకొని ఆలయప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులపై భోగిపండ్లు పోసి అర్చకస్వాములు, వేదపండితులు ఆశీర్వదించారు. దాదాపు 100 మందికిపైగా చిన్నారులకు భోగిపండ్లు పోసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.











నేడు శివ పార్వతుల కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. నందివాహనంపై ఆదిదంపతులను ఊరేగిస్తారు.







వైభవంగా వార్షిక ఆరుద్రోత్సవం



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం వార్షిక ఆరుద్రోత్సవం వేడుకను దేవస్థానం వైభవంగా జరిపింది. పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి 12 గంటలకు మల్లికార్జునస్వామివారికి మహాన్యాసపూర్వక లింగోద్భవకాల ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున మంగళవాయిద్యాలు, స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి తరువాత స్వామి, అమ్మవార్లకు ప్రాతఃకాలపూజలు జరిపించి అనంతరం అమ్మవార్లకు విశేషపూజాధికాలు, నందివాహనసేవ నిర్వహించారు. ఉత్తరద్వారమైన శివాజీ గోపురం నుంచి వెలుపలకి తీసుకువచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. పుష్యశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సాయంత్రం 6.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు విశేష పుష్పార్చన నిర్వహించారు.

గోదా రంగనాథుల కల్యాణోత్సవం



గోదా రంగనాథులకు లఘు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కర్నూలు కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మామిదాల పాడులోని గోదా రంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో ధనుర్మాస వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం గోదా రంగనాథుల లఘు కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. ధనుర్మాస నిత్యారాధనల్లో భాగంగా వేకువ జామున 4:30 గంటలకు అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి వారికి, గోదాదేవి, శ్రీకృష్ణులకు సాలగ్రామాలకు పంచసూక్త పారాయణంతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. తోమాల సేవ, తిరుప్పావై పఠనం చేశారు. అనంతరం శ్రీరంగనాథ, శ్రీలక్ష్మీ, శ్రీగోదాదేవి అమ్మవార్లకు శతనామార్చాన, తిరుప్పావై గానం చేశారు. ఆలయంలో భోగి పండుగ వేడుకలను, సాయంత్రం గోదా రంగనాథుల లఘు కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోదా గోకుల క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో చేపల మాఫియా



(7వ పేజీ తరువాయి)

పౌల్ట్రీ ఫాంలకు ఎండు చేపలు ఎగుమతి: ప్రతి ఏటా చేపల మాఫియా రూ.కోట్లలో దోచుకుంటోంది. అలవి వలల ప్రత్యేక ఏమిటంటే నీటిలో అగ్గిపుల్ల ఉన్నా కూడా ఈ వల లాగేస్తుంది. చిన్న చేపలను నది తీరం ప్రాంతంలోనే ఎండబెట్టి బస్తాలలో నింపి విజయవాడ, గుంటూరు, వైజాగ్ తదితర ప్రాంతాల్లోని పౌల్ట్రీ ఫాంలకు కి.లో. రూ.300 చొప్పున రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఎండు చేపల వ్యాపారులు ప్రతి ఏటా రూ.కోట్లకు పడగలు ఎత్తుతున్నారు. ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

పారిపోవాలని చూస్తే ప్రాణం మీదికే

చేపలు పట్టేందుకు వచ్చిన కార్మికులు ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నిస్తే.... నదిలోనే గుర్తు తెలియని శవాలుగా తేలుతాయనే ప్రచారం ఉంది. .తమకు ఎదురుతిరిగిన కార్మికులను మత్స్య మాఫియా బతకనివ్వదనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలల మధ్యలో అటు తెలంగాణ రాష్ట్రంలో, ఇటు నంద్యాల జిల్లాలోని పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు అవుతూనే ఉంటాయి.

34 మందిపై బైండోవర్ కేసు నమోదు

కృష్ణానదిలో చేపల వేట కొనసాగించేందుకు వచ్చిన 34 మంది మత్స్యకారులపై ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో జనవరి 4వ తేదీన బైండోవర్ కేసు నమోదైయింది. వివిధ ప్రాంతాల నుంచి చేపల వేట కొనసాగించేందుకు కొంత మంది మైనర్ బాలురులను తీసుకొని వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయంలో 34 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

కన్నెత్తి చూడని మత్స్యశాఖ అధికారులు

ఒకరోజు కాదు...రెండు రోజులు కాదు... దాదాపు 5 నెలల పాటు జరిగే ఈ చేపల మాఫియా ఏ అధికారికీ కనిపించడం లేదు. కృష్ణానదిలో జరుగుతున్న అలవి వలలతో అక్రమంగా సాగుతున్న చేపల వేటను అరికట్టాల్సిన మత్స్యశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. మత్స్యశాఖ అధికారులు జాలర్లతో మాఫియాతో కుమ్మక్కు అవడం వల్లే ఈ ఫిషింగ్ మాఫియా యథేచ్ఛగా జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బానిసలుగా కార్మికులు

నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామం నుంచి జానాలగూడెం, బలపాలతిప్ప, పాతాళగంగ వరకు మొత్తం నదిలో దాదాపు 60 బ్యాచ్‌లు చేపల వేట కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క బ్యాచ్‌లో 20 నుంచి 30 మంది వరకు చేపలు పట్టే వారు ఉంటారు. ఇలా ఒక్కొక్క గుంపు మేస్త్రీ రెండు లేదా మూడు వలలను సిద్ధం చేసుకొని మత్స్యకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించి మత్స్య సందపను దోచుకుంటున్నారు. జూన్ నుంచి ఫిబ్రవరి, మార్చి వరకు శ్రీశైలం ప్రాజెక్టులో తిరుగు జలాలు నిల్వ ఉంటాయి. మత్స్య మాఫియా జాలర్లకు అడ్వాన్సుగా డబ్బులు ఇచ్చి తమ ఆధీనంలో ఉంచుకుంటారు. చేపలు పట్టడానికి వచ్చే వారంతా వైజాగ్, తమిళనాడు, ఒరిస్సా ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ. అక్కడి నుంచి వీరిని కొంత డబ్బులు ముందుగానే చెల్లించి నాలుగు, ఐదు నెలల పాటు ఉండాలని ఒప్పందంపై ఇక్కడికి తీసుకొస్తారు.



కృష్ణానదీ తీరంలో ఎండబెట్టిన చేపలు



నీలకంఠేశ్వరుని ప్రాభవం



విద్యుత్ దీపాలంకరణతో వెలిగిపోతున్న నీలకంఠేశ్వర స్వామి ఆలయం

- ఎమ్మిగనూరులో మొదలైన ఉత్సవాలు
- కన్నుల పండువగా శివ పార్వతుల కళ్యాణం



ఎమ్మిగనూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): చేనేతపురి.. ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్యదైవం నీలకంఠేశ్వరుని ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటిరోజు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పుష్పరథంపై ఊరేగించారు. రాత్రి ఆలయంలో వరుడు మహాశివుడి తరఫున గడిగె కుటుంబానికి చెందిన వారు, వధువు పార్వతీదేవి తరఫున బండ కుటుంబానికి చెందినవారు పెద్దలుగా వ్యవహరించి వివాహ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, వంశ పారంపర్య ధర్మకర్త కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల అలంకరణ: నీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో, కూడళ్లలో తోరణాలు ఏర్పాటు చేశారు. దీంతో ఊరంతా శోభాయమానంగా మారింది.



అర్ధరాత్రి 12 గంటల సమయంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

కమనీయం.. అంబా భవాని రథోత్సవం

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



అశేష జనవాహిని నడుమ ముందుకు సాగుతున్న అంబా భవాని రథం

కోసిగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లబండ గ్రామంలో అంబా భవాని రథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. వెంకమాంబ కృష్ణావధూత పీఠాధిపతి మర్రిస్వామితాత, కృష్ణస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించారు. కర్నూలు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రా రెడ్డి అమ్మవారిని దర్శించుకుని మఠం పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ వేడుకలకు మన రాష్ట్రంతో పాటు కర్నాటక నుంచి వేలాదిగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కోసిగి ఎస్ఐ చంద్రమోహన్, కౌతాళం సీఐ అశోక్ కుమార్, మాధవరం ఎస్ఐ విజయకుమార్ గట్టి బందోబస్తు నిర్వహించారు. టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, అర్లబండ సర్పంచ్ మల్లికార్జున, అయ్యప్ప, జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, రథం





రథోత్సవంలో పాల్గొన్న పాలకుర్తి తిక్కారెడ్డి, రాఘవేంద్రరెడ్డి

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి : ఇద్దరికి గాయాలు

ఆలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం పెద్దహోతూరు సమీపంలో బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొట్టడంతో బళ్లారికి చెందిన గాజుల చంద్రశేఖర్(50) అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బళ్లారిలో గాజుల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్న గాజుల చంద్రశేఖర్ సోమవారం తన ద్విచక్ర వాహనంపై సమీప బంధువు వీరేష్, ఆయన కుమారుడు గీతేష్ పత్తికొండలో ఉన్న పులికొండ రంగస్వామి దర్శనం కోసం బయల్దేరారు. దర్శనం చేసుకొని తిరిగి బళ్లారి వెళ్తుండగా పెద్దహోతూరు వద్ద సాయంత్రం 6గంటలకు జరిగిన ప్రమాదంలో చంద్రశేఖర్ మృతి చెందాడు. చంద్రశేఖర్‌కు భార్య నాగమణి, కూతురు శబరి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడులు

మహానంది, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బసవాపురం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో సోమవారం కోళ్ల పందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి పదుల సంఖ్యలో పందెం రాయుళ్లు పాల్గొని కోళ్ల పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా పందెం రాయుళ్లు పరారీ అయ్యారు. ఈ దాడుల్లో రూ.23,500 నగదుతోపాటు 20 మోటార్ బైకులతోపాటు ఒక ఆటో, ఐదు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

పాణ్యం, జనవరి13 (ఆంధ్రజ్యోతి): స్థానిక చాకలిపేటకు చెందిన వివాహిత చాకలి తులసి (32) సోమవారం ఆత్మహత్య చేసుకుందని వైద్య సిబ్బంది తెలిపారు. విషం కలిసిన నీళ్లు తాగడంతో బంధువులు పాణ్యం సీహెచ్‌సీకి తరలించారని చెప్పారు. చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు.

బయల్పడిన సంగమేశ్వర ఆలయ గోపురం



గోపురానికి పూజలు చేస్తున్న పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ

కొత్తపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న సప్తనదుల సంగమేశ్వరాలయం శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి మెలమెల్లగా బయల్పడుతూ గోపురం సోమవారం సాయంత్రం భక్తులకు ఇలా దర్శనమిచ్చింది. దీంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఎగువ ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి మరబోటు ద్వారా వెళ్లి నదిలో బయల్పడిన ఆలయ గోపురానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులకుగాను 857.60 అడుగులు కాగా, రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలకు గానూ, 98.9024 టీఎంసీలుగా నమోదైంది. దీంతో సంగమేశ్వర ఆలయ గోపురం సోమవారం సాయంత్రానికి ఆలయ గోపురం పూర్తిగా బయల్పడింది. నీటి విడుదల ఇలాగే కొనసాగితే రానున్న శివరాత్రి కల్లా సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చే అవకాశం ఉంది.

ఆలయంలో చోరీ

ఆదోని రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత దొంగలు సిద్ధలింగేశ్వర ఆలయంలోచోరీకి పాల్పడ్డారు. భీమక్క, మాదమ్మ అమ్మవార్ల గొంతులోని బంగారు మంగళసూత్రాలను అపహరించారు. ఆభరణాల విలువ రూ.40వేలకు పైగా ఉంటుందని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు..

కాగా గ్రామస్థులు దొంగలను పట్టుకొని ఇస్వి పోలీసులకు అప్పజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

పూర్తయిన గోకులం షెడ్లు

- సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు ప్రారంభోత్సవాలు



క్రిష్ణగిరిలో సిద్ధమైన గోకులం షెడ్డు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు నీడ కల్పించాలనే సదుద్దేశంతో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేస్తున్న గోకులం షెడ్ల నిర్మాణాలు చకచకా పూర్తవుతున్నాయి. రెండు జిల్లాలో 2వేల దాకా గోకులం షెడ్లు మంజూరయ్యాయి. జిల్లా నీటి యాజమాన్య సంస్థ 90 శాతం సబ్సిడీతో వీటిని మంజూరు చేసి నిధులను ఖర్చు చేస్తుంది. కేవలం 10 శాతం ఖర్చు మాత్రమే రైతు భరించాలి. సంక్రాంతి పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం పూర్తయిన గోకులాల షెడ్లను ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధుల చేత 10 నుంచి 12వ తేదీ వరకు ప్రారంభించి రైతుల్లో సంతోషం నింపింది. కర్నూలు జిల్లాలో 320 గోకులం షెడ్లు, నంద్యాల జిల్లాలో 700 గోకులం షెడ్లు పూర్తి కాగా, శనివారం రెండు జిల్లాలో ప్రజాప్రతినిధుల చేత ప్రారంభోత్సవాలు జరిగాయి. ఒక్కో గోకులం షెడ్డుకు రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాది కర్నూలు జిల్లాలో 1200, నంద్యాల జిల్లాలో 850 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఈ షెడ్లను నిర్మించుకునేందుకు రైతుల వద్ద పోటీ వాతావరణం నెలకొంది. ఇప్పటి దాకా పాడి పశువులను ఎక్కడ ఉంచాలో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రభుత్వం జిల్లా నీటి యజమాన్య సంస్థ ఆధ్వర్యంలో 90 శాతం సబ్సిడీని భరించి గోకులాల ఏర్పాటుకు పచ్చజెండా ఊపడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ నెలాఖరుకల్లా గోకులం షెడ్లను పూర్తి చేసి రైతులకు అందిస్తామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా పశుసంవర్ధక అధికారి మోహన్ నాయక్ తెలిపారు.

సంక్రాంతి శుభాకాంక్షలు : డీసీసీ



పి.మురళీకృష్ణ



లక్ష్మీనరసింహ యాదవ్


నంద్యాల/కర్నూలు అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రజలకు డీసీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, పి.మురళీకృష్ణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. హిందువులకు అతి ముఖ్యమైన పండుగని, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. భోగ భాగ్యాల భోగి, సుఖ సంతోషాల సంక్రాంతి, కమ్మని వంటల కనుమ కలబోసి ఆనందం వెల్లివిరియాలని సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలకు సొంత గ్రామాల మీద మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక మకర సంక్రాంతి అని పేర్కొన్నారు. జిల్లా


మార్కెట్ యార్డులో క్రికెట్ పోటీలు

కర్నూలు న్యూసిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో సోమవారం మార్కెట్ యార్డు ఆవరణలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి నగేష్ హాజరై మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపు ఓటమి సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్, విక్రమ్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.












భోగి మంటలను వెలిగిస్తున్న టీజీ రాజ్యలక్ష్మి


ముగ్గుల పోటీలు

ఇలపై హరివిల్లు

● నగరంలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు
● ముగ్గులు మన సంస్కృతి : టీజీ రాజ్యలక్ష్మి

కర్నూలు కల్చరల్/స్పోర్ట్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇలపై ఇంద్ర ధనుస్సులు విరిసినట్లు, నింగిలోని చుక్కలన్నీ నేలపై వాలినట్లు రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. సోమవారం నగరంలోని క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో, డీవీఆర్ బ్రాడ్ బాండ్, టీజీవీ గ్రూప్స్ సహకారంతో నిర్వహించిన 'సంక్రాంతి ముగ్గుల పోటీ'లకు అనూహ్య స్పందన లభించింది. భారీ సంఖ్యలో మహిళలు హాజరై ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ముందుగా మైదానంలో 'భోగి' మంటలు వేసి, సంప్రదాయ పాటలతో భోగి వేడుకను ప్రారంభించారు. మైదానంలో ఏర్పాటు చేసిన హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దు ఆటగాళ్ల విన్యాసాలు అలరించాయి. ఈ సందర్భంగా టీజీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ముగ్గులు వేయడం మన సంస్కృతిలో ఒక భాగమన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా మహిళలకు సంప్రదాయ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. డీవీఆర్ బ్రాడ్‌బాండ్ అధినేత డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ల మార్గదర్శనంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 15న సాయంత్రం 5 గంటలకు జరిగే ముగ్గుల పోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీ వెంకటేశ్, టీజీ భరత్ హాజరవుతారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి మొదటి బహుమతిగా ఓపెన్ ప్లాట్, రెండో బహుమతిగా ఈ-బైక్, మూడో బహుమతిగా సోఫాసెట్, నాలుగో బహుమతిగా పావుకిలో వెండితోపాటు మరో 30 బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రైస్ కుక్కర్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవీఆర్ సిటీ అండ్ డిజిటల్ జీఎం ఎస్కే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తక్షణమే విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని వామపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి కే.భారతి అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట వామపక్ష ప్రజాసంఘాల అధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలోపే రెండుసార్లు కరెంటు చార్జీలు పెంచి పేదలపై దాదాపు రూ.17 వేల కోట్లు భారం మోపారన్నారు. జనవరిలో కరెంటు బిల్లులు ఒక్కొక్కరికి రెండింతలు పెరిగాయని, ఈ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పి.నిర్మల. సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సమాఖ్య అధ్యక్షురాలు గిడ్డమ్మ, ఏఐటీయూసీ నగర డిప్యూటీ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

● కూటమి ప్రభుత్వం పేద ప్రజలపై పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నగరంలో నిరసన సెగ మొదలైంది. భోగిని పురస్కరించుకుని సోమవారం సీపీఎం అధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ విద్యుత్ బిల్లులను దహనం చేసిన నిరసన తెలిపారు. వీకర్ సెక్షన్ కాలనీ, ఇందిరాగాంధినగర్, పాతబస్టాండు అంబేద్కర్ కూడలి, మండి బజార్, ముజఫర్ నగర్, 19,20 వార్డులు, జొహరాపురం, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు అలివేలమ్మ, రాముడు, పి.నిర్మల, ఎం.రాజశేఖర్, అబ్దుల్‌దేశాయ్, షరీఫ్, పాల్గొన్నారు.

గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జె మోహన్ అన్నారు. సోమవారం గూడూరులో సీపీఎం ఆధ్వర్యంలో భోగి పండుగ సందర్భంగా పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, దానమన్న, మధు, సోమలింగడు, మద్దిలేటి పాల్గొన్నారు.

కోడుమూరు: కరెంటు బిల్లుల విషయంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని నిరసన వ్యక్తం చేసిన సీపీఎం నాయకులు కరెంటు బిల్లులను మంటల్లో తగులబెట్టారు. కరెంటు బిల్లులను పెంచాడం పట్ల సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక కోట్ల సర్కిల్లో సోమవారం నిరసన చేపట్టారు. ఈ మండల కార్యదర్శి కామార్తి రాజు మాట్లాడుతూ రెండు, మూడు సంవత్సరాల కిందట వాడిని విద్యుత్ వాడకాన్ని ప్రస్తుతం ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.18వేల కోట్లను భారం మోపిందన్నారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీపీ వీరన్న, బుడ్డప్ప, శంకర్, వెంకటేశ్వర్లు, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న వామపక్ష ప్రజా సంఘాల నాయకులు

ఘనంగా భోగి వేడుకలు


సుశీల నేత్రాలయలో భోగి వేడుకలు

కర్నూలు హాస్పిటల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బుధవారపేటలోనున్న సుశీల నేత్రాలయలో సోమవారం ఉదయం భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా సుశీల నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.పి.సుధాకర్‌రావు మాట్లాడుతూ భోగి మంటల తేజస్సుతో ప్రజల జీవితాలు ఆనందంగా సాగాలన్నారు. భోగి పండగతో ఆరోగ్యం సిద్ధిస్తుందని పాత వస్తువులు భోగి మంటల్లో వేస్తే అరిష్టాలు తొలుగుతాయన్నారు. సంక్రాంతి సంస్కృతి సంప్రదాయాలతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టు డా.సావిత్రి సుధాకర్, రేటినా స్పెషలిస్టు డా.నేహ సుధాకర్, కార్నియా స్పెషలిస్టు డా.రాఘవ ప్రీతమ్ పాల్గొన్నారు.

కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో...

సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం భోగి సంబరాలు నగరంలోని ఏ.క్యాంపు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబరాన్నంటాయి. హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డా.పి.చంద్రశేఖర్ నేతృత్వంలో సోమవారం ఉదయం భోగి మంటలు వెలిగించారు. భోగి మంటలు మనలోని మాలిన్యాన్ని తొలగిస్తాయన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, న్యూరాలజిస్టు డా.హేమంత్ కుమార్, సభ్యులు రాముడు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామాలలో సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా మొదటిరోజున భోగి ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువజామునే చిన్నాపెద్ద నిద్రలేచి భోగిమంటలు వేశారు. మహిళలు, యువతులు ఇళ్లముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దుతూ సందడి చేశారు.

గూడూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం భోగి సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. వేకువ జామునే మహిళలు ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేశారు.

ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం : గౌరు

కల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదలు, ఉద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్టర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం ప్రజలు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పెండింగ్ బిల్లులను ప్రాధాన్యత క్రమంలో చెల్లించేలా సీఎం చర్యలు చేపట్టారని తెలిపారు. ఆర్థికలోటు ఉన్నా తన అనుభవంతో నిధులు సమీకరించి ప్రతి కుటుంబానికి సంక్రాంతి శోభతెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు పెట్టిన ఫీజు బకాయిలు రూ.788 కోట్లు విడుదల చేసి 6.5 లక్షల కుటుంబాలకు లబ్ధిచేకూర్చారని గౌరు దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు మొత్తం పెండింగ్ బిల్లులు రూ.6700 కోట్లు విడుదల చేసి ఉద్యోగుల ఇంట సంక్రాంతి సంతోషం నెలకొనేలా చేశారని అన్నారు. పేదలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌కు ఆసుపత్రులకు చెల్లించేలా రూ.400 కోట్లు, డ్రగ్, మెడిసిన్‌కు రూ.100 కోట్లు విడుదల చేశారన్నారు.





కురువ, మదాసి కురువ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు హాస్పిటల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో కల్లూరు బీరప్ప స్వామి దేవాలయంలో జిల్లా కురువ, మదాసి కురువ, మదారి కురువ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను నగర కమిటీ అధ్యక్షులు ఎల్లప్ప ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. కురుబ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప, అమీలియో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సీనియర్ ఫిజీషియన్ డా.లక్ష్మి ప్రసాద్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కులపెద్దలు రాంకుమార్, సంఘం గౌరవాధ్యక్షులు రామచంద్రుడు, కోశాధికారి మహేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటకృష్ణ, మురళి మోహన్ పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతం

కర్నూలు కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లోగల శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం (హరిహర క్షేత్రం)లో సోమవారం సాయంత్రం భోగి పండుగ, పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు నిర్వహించారు.

ఉన్నతాధికారితో విచారణ జరిపించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం నాయకల్లు గ్రామానికి చెందిన భారతి అదృశ్య కేసును మహిళా పోలీసు ఉన్నతాధికారితో విచారణ జరిపించాలని ప్రజా సంఘాలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ప్రజా సంఘాలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారతి జనవరి 1వ తేదీన ఉదయం 11 గంటల నుంచి కనిపించడం లేదన్నారు. ఉలిందకొండ పోలీసుస్టేషన్‌లో హౌస్ ఆఫీసర్ బాధితుల స్టేట్‌మెంట్ గానీ, ప్రజా సంఘాల సూచనలను గానీ పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారతి అదృశ్య కేసును విచారణకు ఆదేశించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పట్నం రాజేశ్వరి, శేషఫణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బీసీ జనసభ ఎరుకుల రాజు, రాష్ట్ర అధ్యక్షులు ఎరుకుల హక్కుల పోరాట సమితి జయన్న, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి, మాధవుల కల్యాణం


స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

కోడుమూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో గోదాదేవి, మాధవస్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకలో ఎస్ఐ శ్రీనివాసులు సతీసమేతంగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన జనార్ధన్, లక్ష్మీదేవి దంపతులు స్వామి, అమ్మవార్ల కల్యాణంలో తాళి, వస్త్రాలు, పూజాసామగ్రి వితరణ చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మురళి, మాధవనాయుడు, పూజారులు వెంకటరమణ, కేశవులు, జనార్దన్ పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథస్వామి కల్యాణోత్సవం


నాగిరెడ్డి కాలనీలో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కొనసాగుతున్న ధనుర్మాస వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీ గోదా రంగనాథస్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుడు మధుసూధనాచార్యుల బృందం కల్యాణ విశేషాలను వివరిస్తూ ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ గత 35ఏళ్లుగా భరతమాత దేవాలయంలో కర్నూలు విష్ణు సహస్రనామ సత్సంగం వారి ఆధ్వర్యంలో వైభవంగా ధనుర్మాస వేడుకలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నందడి మహేష్, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, ప్రతాపరెడ్డి, కొండా శ్రీనివాసులు, తిమ్మయ్య, కొండయ్య, లావణ్య, శ్రీదేవి, అన్నపూర్ణమ్మ, శకుంతల, ఇందిర, గాయత్రి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


వాసవీనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం





16న రాతి దూలం పోటీలు

తుగ్గలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామంలో ఈ నెల 16న రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జగన్ మోహన్ తెలిపారు. ఉరుసులో భాగంగా నిర్వహిస్తున్నామన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు ప్రహరీ నిర్మించాలి

ఆలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంత మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని సీఐటీయూ నాయకుడు నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ దుకాణాలను దక్కించుకున్న వారు వ్యాపారాలను చేసుకోవాలంటే భయాందోళనకు గురవుతున్నారన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు.

ఘనంగా భోగి

- ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో వేడుకలు
- భోగి మంటల వద్ద సందడి





ఆదోని పట్టణంలోని అంబా భవాని ఆలయం వద్ద భోగి మంటలు, ఇన్‌సెట్‌లో ముగ్గు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో భాగంగా సోమవారం భోగిని పట్టణవాసులు చేసుకున్నారు. కిలిచిన్ పేట అంబాభవాని ఆలయ ఆవరణలో తెల్లవారుజామునే భోగి మంటలను వెలిగించారు. మహిళలు ఇంటిముంగిట రంగురంగుల ముగ్గులు వేశారు. జిందేశంకర్, ఆదిశేషులు, జిందే హుళ్ళి శంకర్, రఘునాథ్, నాగరాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

ఆలూరు: మండలంలో సోమవారం భోగి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీవాసులు మంటలు వేసుకు న్నారు. ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. అన్నివీధుల్లో రంగురంగుల ముగ్గులను

భోగి సంబరాలు..

తుగ్గలి: మండలంలో భోగి పండుగను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు ముగ్గులు వేసి రంగులు చల్లి, గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. అలాగే యువతీ యువకులు భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో భోగి పండుగను జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి పురస్కరించుకుని భోగి పండుగను తెల్లవారుజామునే పాత వస్తువులను తెచ్చి భోగి మంటల్లో వేశారు.

ఘనంగా భోగి

వెల్దుర్తి టౌన్: పట్టణం, గ్రామాల్లో భోగి పండుగను సోమవారం చేసుకున్నారు. ఉదయం వీధుల్లో చిన్నారులు భోగి మంటలు వేసి ఆటల పాటలతో ఉల్లాసంగా గడిపారు. మహిళలు రంగు రంగుల ముగ్గులతో అలరించారు.



వెల్దుర్తిలో భోగి మంటలు



తుగ్గలిలో ముగ్గు



మద్దికెరలో భోగి మంటల వద్ద..

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Adoni, I issue the following notice to general public. My Clients intends to grant loan to **K.Nagendra, S/o. K.Bheemi Reddy, R/o. H.No: 19/10/2, Pattikonda Village & Post, Pattikonda Mdl, Kurnool Dt.,** by keeping the below mentioned property of his as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

House bearing D.No: **19/10/2** situated in Sy.No:**672/1a** pyki, Pattikonda Grama Panchayath, Pattikonda mdl, within the limits of Pattikonda Sub Registration district and district registration of Kurnool, bounded as follows. **East:** Rastha, **West** : Konda, **North:** Site of Hymavathi, **South:** House of Kunigiri Lakshmi Devi.
Measurements : East to West 50 feet or 15.2 meters, North to South 40 feet or 12.16 meters.
Total Extent : 222.22 Sq.Yards
Built Measurements: East to West 20 feet or 6.08 meters, North to South 18 feet or 5.47 meters. **Total Extent** : Ground Floor **360** Sq.Feet.

C.SOMA SEKHAR
Advocate, Cell: 94900 00338.

ప్రజలపై భారం మోపడాన్ని సహించం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య



జీవో ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారం మోపడం సహించమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య హెచ్చరించారు. పెంచిన విద్యుత్ చార్జీల ప్రతులను అంబేడ్కర్ సర్కిల్ వద్ద భోగి మంటల్లో దహనం చేశారు. అధికారంలోకి వచ్చే రాజకీయ పార్టీలు ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలు పెంచుతుండటంతో ప్రజలు భారం మోయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలను ఇష్టానుసారంగా పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందన్నారు. కార్యదర్శులు రాజాసాహెబ్, రామాంజనేయులు, సభ్యులు సురేంద్ర కుమార్, కృష్ణయ్య, జయలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పల్లెల అభివృద్ధి



మద్దికెరలో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, కోఆప్షన్ మాజీ సభ్యుడు సత్తార్ అన్నారు. సోమవారం మోమిన్ వీధిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిచారు. పరిశీలించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. చంద్రబాబు అదికారంలోకి వచ్చిన వెంటనే ఏడు నెలల్లో మండలంలో రూ.2కోట్ల అభివృద్ధి పనులు చేశారన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు చొరవ చూపి మండలానికి రూ2కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. నాయకులు రంగయ్య ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- ఆదోనిలో క్రికెట్ పోటీలు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం వస్తుందని ఆదోని తాలుకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, పారిశ్రామిక వేత్త విట్టా రమేష్ పేర్కొ న్నారు. పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో సోమవారం మూడో రోజు ఆదోని చాంపియన్ షిప్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. గరీబ్-11 వర్సెస్ కింగ్స్-11 మధ్య పోటీని అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్ మున్సిపల్ హైస్కూలు హెచ్ఎం మల్లికార్జున ప్రారంభించారు. క్రీడాకారులను ఉత్సాహ పరిచేందుకు కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. కింగ్స్-11 జట్టుపై గరీబ్-11 జట్టు విజయం సాధించింది. ఈ పోటీలు ఈనెల 19వరకు పోటీలు సాగుతాయని విజేతకు రూ.లక్ష నగదు పురస్కారం, రన్నర్‌కు రూ.50వేల నగదు ఇస్తామని నిర్వాహకుడు కె.ఎం ముజీబ్ తెలిపారు.

మద్దికెర: క్రీడలతో ఉల్లాసం వస్తుందని టీడీపీ నాయకుడు కేవీ రాజేశ్వర చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు అన్నారు. సోమవారం పెరవలి గ్రామంలో రాయలసీమ స్థాయి అండర్-19 కబడ్డీ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. స్నేహపూర్వకంగా పాల్గొనాలని గెలుపు ఓటములు సహజమేనన్నారు. అర్చకులు రంగస్వామి తదితరులు ఉన్నారు.

శాకంబరి దేవి అలంకరణలో లక్ష్మమ్మ



ఆదోని టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ సందర్భంగా పట్టణంలోని లక్ష్మమ్మ శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం వంశ పారంపర్య ధర్మకర్త రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు చిన్నారులకు మందు

చిన్నారులకు 15వ తేదిన రోగనిరోధక శక్తినిచ్చే మందు పంపిణీ చేస్తామని అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా సోమవారం తెలిపారు. కాకుబాల్ నగేష్ సౌజన్యంతో ఇవస్తున్నామని, ఫోన్‌నెం. 9849478178లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పదోన్నతుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డిని కోరినట్లు పురపాలక కమిటీ సభ్యుడు వీరచంద్ర యాదవ్ తెలిపారు. సోమవారం విజయవాడలో జరిగిన 78వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కలిశామన్నారు. పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. జీపీఎఫ్, పెండింగ్ బకాయిలు, కేజీబీవిలకు ఎంటిఎస్ వర్తింపు సమస్యలను విన్నవించామన్నారు.

శనగ రైతులకు పరిహారం ఇవ్వాలి

మద్దికెర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శనగ రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని మండల వైసీపీ అధ్యక్షుడు టి.మల్లికార్జున యాదవ్, ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ 18వేల ఎకరాల్లో శనగ సాగు చేశారని, తుఫాన్ ప్రభావంతో పంటకు తెగులు సోకి పూర్తిగా ఎండిపోయి కుళ్లిపోయిందన్నారు.

తడి, పొడిచెత్తను వేరు చేయండి

మద్దికెర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తడి, పొడిచెత్తను వేరు చేయాలని సర్పంచ్ పద్మావతి, కార్యదర్శి హరికృష్ణ అన్నారు. సోమవారం బురుజుల గ్రామంలో చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. బురుజుల మోహన్, రంగస్వామి ఉన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

ఆదోని రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచమన్న కూటమి అధికారం చేపట్టిన ఆరునెలలకే భారం మోపిందని సీపీఎం కార్యదర్శి లింగన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. తక్షణమే చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నారా లోకేష్‌కు ఆలూరు సమస్యలు

ఆలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆలూరు సమస్యలను మంత్రి లోకేష్‌కు విన్నవించినట్లు టీడీపీ నాయకులు మొలగవల్లి కురువ హనుమప్ప, విశ్వతేజ, సోమశేఖర్ తెలిపారు. వేదవతి, నగరడోణ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని, జింకల బెడదను నివారించి రైతులను ఆదుకోవాలని సోమవారం తిరుపతి జిల్లా నారావారి పల్లెలో మంత్రికి విన్నవించామని, ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతి

మద్దికెర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బురుజుల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎల్.మురళి మోహన్ (58) సోమవారం మృతి చెందాడు. వివరాలు.. గుంతకల్లులో నివాసముంటూ హంపా గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ బైక్‌పై వచ్చివెళ్లేవాడు. డిసెంబరు 21న విధులు ముగించుకుని సొంత పనుల నిమ్మితం బళ్లారికి వెళ్తుండగా బైక్ బోల్తాపడి తీవ్ర గాయాలకు గుర య్యాడు. చికిత్స నిమ్మితం బెంగుళూరు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. భార్య జయశ్రీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ముగ్గులు అభినందనీయం

పత్తికొండ టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి విశిష్టతను తెలియజేసేలా ముగ్గులు వేయడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మహిళా సమ్మైక్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు భీమలింగప్ప, కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, కారుమంచి ఉపేంద్ర, పెద్దయ్య, సిద్దు, నజీర్, శివ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం



మంచాలమ్మకు పూజలు చేస్తున్న కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం ఈశ్వరప్ప

మంత్రాలయం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామిని కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం ఈశ్వరప్ప సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేష వస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఆయన వెంట ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషీ, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అంతర్రాష్ట్ర గిరక లాగుడు పోటీలు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో సోమవారం అంతర్రాష్ట్ర గిరక లాగు పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతల నుంచి 18ఎద్దుల జతలు వచ్చాయి. పోటీలను వైసీపీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్ద వై.రుద్రగౌడు ప్రారంభించారు. గుడికల్లు గ్రామానికి చెందిన చాకలి నల్లయ్య ఎద్దులు పది నిమిషాల్లో 3516.8 అడుగుల దూరాన్ని లాగి మొదటి బహుమతి రూ.30వేలను కైవసం చేసుకున్నాయి. అలాగే గుడికల్లు గ్రామానికి చెందిన కొండయ్య ఎద్దులు 3,395.7 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.25వేలను, గుడికల్లు గ్రామానికి చెందిన ఆకుల మంగయ్య ఎద్దులు 3,388.3 అడుగుల దూరాన్ని లాగి మూడవ బహుమతి రూ.20వేలను, నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన ఈరన్న ఎద్దులు 3,381 అడుగుల దూరం లాగి నాల్గవ బహుమతి రూ.15వేలను, దేవనకొండ మండలం గుమ్మరాళ్ల పాలకుర్తి గ్రామానికి చెందిన ఉసేని ఎద్దులు 3,350 అడుగల దూరం లాగి ఐదవ బహుమతి రూ.10వేలను, అలాగే ఆస్పరి మండలం ఒలకొండ గ్రామానికి చెందిన ఈరన్న ఎద్దులు 3,242.2 అడుగుల దూరం లాగి 6వ బహుమతి రూ.8వేలను కైవసం చేసుకున్నాయి. అలాగే ఎమ్మిగనూరు మండలం గుడికల్లు గ్రామానికి చెందిన చాకలి నల్లన్న ఎద్దులు 3,167.3 అడుగుల దూరం లాగి ఏడవ బహుమతి రూ.5వేలను దక్కించుకున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, రైతులు తరలివచ్చారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వైసీపీ సీనియర్ నాయకులు వై.రుద్రగౌడు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాధవస్వామి, ఖాజా, నిర్వాహకులు పెద్దమాదవస్వామి, ఆకుల మంగయ్య, రంగన్న, చాకలి శ్రీను, బజారి, ఉలిగప్ప, నాగేష్, నరసమ్మ, నల్లయ్య, వీరేంద్ర, నల్లయ్య పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న వృషభాలు

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి: సీఐటీయూ

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారం ప్రజలపై తగ్గించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, డీవైఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీలు, వాడిన కరెంట్‌కు అదనంగా దాదాపు 40శాతం కూటమి ప్రభుత్వం వసూలు చేయడాన్ని సీఐటీయూ ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. జగన్ విధానమే కూటమి ప్రభుత్వం అమలు చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. టీడీపీ, జనసేన నాయకులు బహిరంగ సభల్లో విద్యుత్ చార్జీల పెంపుపై విమర్శలు చేసి ప్రస్తుతం కరెంటు బిల్లుల భారం మోపడం సరికాదన్నారు. అలాగే స్మార్ట్ మీటర్ల విధానం కూడా రద్దు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు కృష్ణ, మోహన్ , సాయితేజ పాల్గొన్నారు.

గోనెగండ్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం భోగి సందర్భంగా స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో మంటలలో పెంచిన విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి విద్యుత్ బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు/ఎమ్మిగనూరు రూరల్ : పెంచిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను తగ్గించాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఎం నాయకులు తిక్కన్న, దేవదాసు, రాజేంద్ర ప్రసాద్‌లు, ఏపీ మహిళా సమాఖ్య ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం ముందు ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో, పెద్దకడబూరుతో పాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ బిల్లులును భోగి మంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, హనుమంతు, వెంకటేశ్వర్లు, తిక్కయ్య, టిప్పు సుల్తాన్, రేణుక, పద్మ, ఈరమ్మ, వరలక్ష్మిలు పాల్గొన్నారు.



భోగి మంటల్లో విద్యుత్ బిల్లును దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పగటి పూట విద్యుత్‌ను అందించాలి

● విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన



గోనెగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర వినతి పత్రం అందజేస్తున్న రైతులు

గోనెగండ్ల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సంబంధించిన విద్యుత్ సరఫరాను అధికారులు పగటి పూటనే ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన రైతులు రమణారెడ్డి, నజీర్, బాషా, జనార్ధన్ అబ్దుల్ ఖయ్యూమ్ మరో 20మంది గోనెగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు పంటపొలాలకు ఇచ్చే కరెంట్‌కు వేళాపాల లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఇస్తున్నారని దీంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పూట కరెంట్ ఇవ్వడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వాపోయారు. పగటి పూట ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బోరు మోటార్లకు కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు మార్లు సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి సమస్యను పరిష్కరించలేదన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ వేళలు మార్చలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని విద్యుత్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో రైతులు వలి, ఇద్రూస్, వెంకటేష్, విశ్వక్ పాల్గొన్నారు.

రేపు రామలింగేశ్వరుడి రథోత్సవం



రాంపురంలో ముస్తాబైన రామలింగేశ్వర స్వామి ఆలయం



రామలింగేశ్వరస్వామి మూలవిరాట్

మంత్రాలయం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాంపురం రామలింగేశ్వరస్వామి మహా రథోత్సవం 15న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మంత్రాలయం మండలంలోని రాంపురం గ్రామం తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వరస్వామి వేడుకలు కన్నులపండువగా ప్రారంభం కానున్నాయి. స్థానిక ప్రజలతో పాటు రాష్ట్ర నలమూలల నుంచే కాక తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు.

●**భారీగా ఏర్పాట్లు :** రామలింగేశ్వరస్వామి మహా రథోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు రాంపురం రెడ్డి సోదరులు టీటీడీ పాలకమంలి మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మంత్రాలయం సొసైటీ మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, భీమా యూత్ నాయకులు ధరణీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. వేడుకలకు భారీగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోనున్నారు. అంతేకాకుండా రథోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఆదోని, గుంతకల్ మాజీ ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్‌రెడ్డి, వెంకటరామిరెడ్డిలతో పాటు ఆంధ్ర, కర్ణాటకకు చెందిన పలువురు పీఠాధిపతులు రానున్నారు.

● బుధవారం రామలింగేశ్వరస్వామి మహారథోత్సవం వైభవంగా జరగనుంది. రాంపురెడ్డి సోదరుల ఇంటి నుంచి పల్లకిలో ఉత్సవమూర్తిని ఆలయం వరకు ఊరేగించి ప్రత్యేపూజలు చేసి మహారథంపై అధిష్టించి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గొరవయ్యలు, కళాకారులు కోలాటాలు, నందికోళ్ల నృత్యాలు, భజన మండళ్లసేవలు భక్తులను ఆకట్టుకోనున్నాయి. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు పరమేష్‌నాయక్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన టీడీపీ నాయకులు

పెద్దకడుబూరు, జనవరి13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి రథోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణతో పాటు కుంకుమార్చన, జలాభిషేకం, పుష్పార్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి రథోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రమాకాంతరెడ్డి, రాకేష్‌రెడ్డి, వైసీపీ నాయకులు ప్రదీప్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎమ్మిగనూరు వైసీపీ సీనియర్ నాయకులు రుద్రగౌడు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోసిగి సీఐ మంజునాథ్, ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు, పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి బందోబస్తును నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పూజారి ఈరన్న, పెద్దయ్య, రఘు, ఓంకారప్ప పాల్గొన్నారు.

తిక్కారెడ్డి పరామర్శ

కోసిగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోసిగి చెందిన టీడీపీ నాయకులు, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ శెట్టిని సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. తిక్కారెడ్డి వెంట నాయకులు పెండ్యాల రమేష్, అమర్నాథ్ రెడ్డి, మహాదేవ, విజయరెడ్డి, తదితరులున్నారు.

మాజీ ఎంపీటీసీ హసన్ మృతి

గోనెగండ్ల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని వేముగోడు గ్రామ మాజీ ఎంపీటీసీ హసన్(80) క్యాన్సర్ వ్యాధితో సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారులు ఉన్నారు. హసన్ దివంగత మాజీ సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉండేవారు. హసన్ మృతివార్త తెలుసుకున్న ఎమ్మెల్యే కోట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పరమేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉరుకుందరెడ్డి, జేడీపీ డబ్ల్యూఏ మాజీ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణరథంపై విహరించారు. సోమవారం పౌర్ణమి భోగి వేడుకలను పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధపూజ మందిరంలో సంస్థాన పూజలు చేశారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో మంత్రాలయం పురవీధులు కిక్కిరిశాయి. భక్తులు భోగి మంటలతో సంబరాలు జరుపుకున్నారు.

బసలదొడ్డి డీలర్‌పై కేసు నమోదు

పెద్దకడుబూరు ,జనవరి13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసలదొడ్డి రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు అయింది. సోమవారం సీఎస్ డీటీ మహేష్, ఆర్ఐ జర్మియా తెలిపిన వివరాల మేరకు.. సాధారణ తనీఖీలో భాగంగా బసలదొడ్డిలోని రేషన్ షాప్ నెం- 13 డీలర్ క్రిష్ణారెడ్డి బియ్యం ఉన్న నిల్వల కన్నా 2.17 క్వింటాళ్లు తక్కువగా ఉండటం, కందిపప్పు ఐదు కేజీల తక్కువ, చెక్కెర 38 ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.